సీతతో సినీమాకి

పిల్లలు ఎలాంటి అవకతవక ప్రశ్నలు వేసినా ఆ పిచ్చిప్రశ్నలకి సరి అయిన సమాధానాలు పెద్దవారు చెప్పని పక్షంలో, పిల్లల జ్ఞానోదయానికి భంగం కలుగుతుందట. అలానొక్కి వక్కాణించే వారందరి వద్దకూ మా సీతని ఒక్కసారి పంపిస్తే సరి ! ఆ పదేళ్ళబాలకి, సీతకి, ఈ ప్రపంచం అంతా అయోమయమే ! అన్నీ ? ? ? అవును, కొశ్చన్ మార్కులే !

ఆమెకి అణువు మొదలు అండపిండ వేదాండ బ్రహ్మాండంవరకూ అన్నీ సందేహాలే ! అన్నీ సంశయాలే ! అన్నీ కొశ్చన్ మార్కులే !

పూర్వం జనకమహారాజు సీతని శివధనస్సు ఎక్కుపెట్టగలిగిన రాముడికిచ్చి పెళ్ళి చేశాడట. అలాగే, మాసీతకి కూడా ఆమె సంశయపరంపరని నివృత్తి చెయ్యగల మహామహుడు భర్త అవుతే బావుండును! ఆమె ప్రశ్నలవర్షం ఖాండవవనం

దహిస్తున్నప్పుడు యింద్రుడు కురిపించిన రాళ్ళవానకి యినుమంతయినా తీసిపోదు.

సీతకి తరుచూ సముద్రంలో కెరటాలు ఎందుకు రావాలనీ, సూర్యుడు మా మేడకి ముందు వైపుని వుదయించి వెనక వైపుని అస్తమించడానికి బదులు వెనక వైపున వుదయించి ముందు వైపునే ఎందుకు అస్తమించకూడదనీ, టెంకాయలోకి నీళ్లు ఎలా వస్తాయనీ, అన్ని రకాల చాక్లెట్లలో ఏ రకం చాక్లెట్లు మంచివనీ మొదలుగాగల సంశయాలు కలుగుతూ వుంటాయి. ఆ లేత మెదడులో అన్ని వైరివ్యూహాలకి తావు ఎక్కడ వుందో!

ఒక రోజు మధ్యాహ్నం కాబోలు నన్ను అడిగింది: "మామయ్యా, మా మేస్టరుగారు భూమి గుండ్రంగా వుందని చెప్పారు నిజమేనా?"

నా గుండె లటుక్కుమంది. చెప్పినదేమో మేస్టరుగారు; నేర్చుకొన్నదేమో తను. మధ్యని నాకెందుకంటా ఈ తంటా?

"అవును."

"ఏమిటి అవును మామయ్యా?"

"ఈ భూమి గుండ్రంగానే వుంది."

"అదే, ఈ ప్రపంచం కోడిగుడ్డులా వుందం

టావు కాదూ? అన్నట్టు మనం కోడిగుడ్డు తిన వచ్చునా, మామయ్యా!"

"మనం బ్రాహ్మలం. తినకూడదు. తప్పు!"

"అవుతే ప్లీడరుగారి అమ్మాయి మందు అని చెప్తూ రోజూ పొద్దున్నే కోడిగుడ్డురసం పుచ్చుకుంటుందేం?"

"నీ కెందుకూ యింకోళ్ళ గొడవ?"

"అవున్లే నాకెందుకు?............భూమి గుండ్రగా వుందంటావు కాదూ?" అంటూ మొదటికి వచ్చింది.

"ఊ" అన్నట్టు తల పంకించాను.

"మరి, భూమి తిరుగుతోందంటారు. నిజమేనా?"

"ఊ"

"అవుతే, మనం తిరగమేం?"

అక్కడితో పడింది బ్రేకు. భూమి తిరుగుతోందని మా మేస్టరుగారూ చెప్పారు, నా చిన్నప్పుడు. భూమి సూర్యునిచుట్టూ తిరగడమే కాకుండా తనలో తను తిరుగుతోందని కూడా చెప్పారు. మనమెందుకు తిరగమని మేమూ అడిగాం, మా మేస్టార్ని. తిరగమని నిష్కర్షగా, విస్సన చెప్పింది.

వేదమన్నట్లుగా, చెప్పాడు. మాలో వున్న బుద్ధాయి ఒకడు ఎందుకు తిరగడని గట్టిగా అడిగితే ఒక్క చురక తగిలించాడు. దెబ్బతో మా సందేహాలన్నీ దేవేంద్రలోకంలోకి పోయినై. Two parallel straight lines will never meet అన్న axiom లా భూమిగుండ్రంగా వున్నదన్న విషయం కూడా ఒక axiom అని మేము నమ్మవలసి వచ్చింది. నా బుర్ర బద్దలు చేసుకొన్నా, ఈ గొడవ అంతా సీతకి అర్థమవుతుందా!

"ఏం, మామయ్యా, మాట్లాడవ్?"

"ఏమిటి?"

"భూమి తిరుగుతోంది కదా మన మెందుకు తిరగం"?

"తిరగం."

"ఏం."

"ఏమీ లేదు."

"ఏంచేత తిరగం?"

"ఏమీ లేదు."

"అదేమిటి మామయ్యా, మా మేష్టారూ అలాగేచెప్పారు, నువ్వూ అలాగే చెప్తున్నావ్?"

మనం ఎందుకుతిరగమో సీతకి నచ్చేటట్లు చెప్పడం సులభసాధ్యం కాదు.

అలా అంటే నవ్వుతున్నారా ? సీతా నవ్వింది, ఫక్కున.

* * *

కిటికీ సందుల్లోనుంచి సూర్యరశ్మి నా టేబుల్ మీద కొద్దికొద్దిగా పడుతోంది. నావళ్లు వుడక పెడుతోంది కాని, చాలా సీరియస్‌గా షెకవ్ కథల పుస్తకం చదువుతున్నాను.

ఎక్కాడెకిని సీత నా టేబుల్ మీదికివచ్చి కూచుంది. నా వళ్లు మండింది.

"మామయ్యా, చెమట పోసేలా చదువుతున్నావేం ?" అంటూ పరికిణాకొంగుతో నా నుదుటి మీద స్వేదబిందువుల్ని తుడిచింది. ఆ అసాధారణపు ఆదరణతో నాకు రావలసిన కోపమంతా మటుమాయమై పోయింది. చిన్న నవ్వు నవ్వాను.

"తర్వాత చదువుకోవచ్చునన్లే, మామయ్యా!" అంటూ నా చేతిలోని పుస్తకం తీసుకొని తనవళ్లో పెట్టుకుంది.

"సీతా, నేను చదువుకుంటూ వుంటే ఎందుకు

పాడుచేశావ్ !” అంటూ ఆ పదేళ్ళబాలనీ నా నావళ్ళోకి లాక్కొని, రెండు బుగ్గలూ మృదువుగా నలిపాను.

“నా బుగ్గలన్నీ కందిపోతున్నాయి,” అని అంది. సీత రెండు చేతుల్తోనూ తన బుగ్గల్ని దాచుకొంది.

ఒక నిముషం అలా గడిచింది.

“సినిమాకి తీసుకు వెళ్తానన్నావ్ ! మర్చిపోయావేమిటి?”

“లేదు. మర్చిపో లేదు. ఇంకా టైమవలేదు.”

ఆ రోజు సీత పుట్టిన పండగ. అంచేత ఆమెని సినిమాకి తీసుకు వెళ్ళాలట !

ఎలాగయితేనేం, సినిమాకి వెళ్ళాం. హాలు చేరుకొనేటప్పటికి యింకా అయిదున్నర అయినా కాలేదు. బుకింగ్ ఆఫీసు అప్పటికి తెరవనే లేదు. రాబోయే ఫిల్ములోని ఫోటోలు చూస్తూ ఒక పావుగంట దాకా నుంచున్నాం. ఇంతలో బుకింగ్ తెరిచారు. పన్నెండేసి అణాలు వెచ్చించి రెండు టిక్కెట్లు కొన్నాను. హాలులో ప్రవేశించినాం.

బయట కొద్దికొద్దిగా చినుకులు పడుతున్నాయి. చల్లగాలి వీస్తోంది! సినిమా చుట్టూ వున్న పూల మొక్కలు కమ్మటి వాసనలు వెదజల్లుతున్నాయి.

అంతవరకూ హాలులోకి వచ్చిపోయే జనసమ ద్దాన్ని పరికిస్తున్న సీత తన దృష్టుల్ని తలవని తలంపుగా పైభాగానికి ప్రసరింప జేసింది.

పంకా తిరగడంలేదు. ఎందుకు తి ర క్క పోవాలి ? ? ?

వచ్చింది మీమాంస ; ఇచ్చింది పంకా తిర గడం లేదన్న వార్త నాకు.

"చల్లగా గాలి వేస్తోంది కదా, సీతా, యింకా పంకా ఎందుకు ?" అంటూ ఈ మామయ్య సీతని సమాధానపరచడానికి ప్రయత్నించాడు. సాధ్యమా ?

"మనం రూపాయిన్నర యిచ్చాం. పంకా ఎందుకు తిరక్కపోవాలి ? ? ? మనం యిక్కడ కూచున్నంతసేపూ తిరగ వలసిందే," అని ఆమె వితండవాదన.

దగ్గర్లో కూచున్న వారిలో తెలుగు వచ్చిన వారు మా సీతాదేవి భావిభారతదేశానికి ఆదర్శ స్త్రీరత్నమవుతుందన్నట్లుగా ఆమె వంక పరకా యించి చూసి తమలో తాము ముసిముసి నవ్వులు నవ్వుకొన్నారు.

నేను గేటువద్ద వున్న మనిషిని సమీపించి పంకా వెయ్యమని ప్రార్థించాను,

"ఆరు అవనియ్యండి సార్ !" అని అన్నాడు, ఆ అపరిచిత వ్యక్తి.

"నేను అయిదున్నరకే డబ్బిచ్చానే !"

అతను వులిక్కిపడి నన్ను ఎగాదిగా చూసి పక్కనివున్న స్విచ్ నొక్కాడు. పంకా గిర్రు మంటూ తిరగడం మొదలెట్టింది. సీత మొహం చింపి చేటంత అయింది.

మొదటి బెల్ కొట్టారు. సీత పరిశోధనా భావంతో నలుదిక్కులూ చూసింది.

"ఏమిటి ?" అని ప్రశ్నించాను.

"చాక్లెట్లు."

అంత వరకూ ఎక్కడ దాగాడోగాని అమాంతం ప్రత్యక్షమయాడు చాక్లెట్ల కుర్రాడొకడు.

"తీసికో, అమ్మా!" అంటూ కుర్రాడు పళ్ళాన్ని సీత ముందు పెట్టాడు. రకానికి మూడు చొప్పున సీత తీసికొంది. పన్నెండు రూపాయి తీసుకు పోయాడు చాక్లెట్ల వెధవ.

"అన్ని తీసుకొన్నావేం !" అని అన్నాను, సీతతో.

"తీసుకుంటున్నప్పుడు వద్దనక పోయావూ. కాగితం విప్పేశాను కూడాను."

"... ... ..."

"ఆ కుర్రాడు తీసుకుంటాడేమో! పిల్చి, కొన్ని యిచ్చేసెయ్యి.," అంటూ నా వంక వోరకంట చూసింది.

నాలో నేను నవ్వుకొన్నాను. ఆమె యిచ్చేదీ లేదు; వాడు తీసికొనేదిలేదు.

సినిమా మొదలుపెట్టారు. సీతకి దాహమయింది. వింటో కావాలంది. నోటిదగ్గర పెట్టుకొని బావుండలేదని తోసేసింది.

టీ కావాలంది. టీలో పంచదార తక్కువయింది; రుచిగా లేదుకనుక తాగలేనంది.

మంచినీళ్ళు కావాలంది. సోడాఅమ్మేకుర్రాడ్ని బతిమాలి, వాడికి ఒక అర్ధణా దక్షిణయిచ్చి, మంచినీళ్ళు తెచ్చి పెట్టమన్నాను. మంచినీళ్లు తాగింది.

శాంతా ఆప్టే ఒక పాట పాడుతోంది. గానప్రతిభ అంతా ఆ పాటలో వుట్టిపడుతోంది. ఆమె కంఠమాధుర్యం ప్రేక్షకుల్ని తన్మయులయేటట్టు చేస్తోంది. కాని సీతకి సినిమా అంతా ఏమిటోలా వుంది.

ఇంతలో ఇంటర్ వెల్.

మళ్లీ చాక్ లెట్ల కుర్రాడు నవ్వుతూ మా దగ్గిరికి వచ్చాడు. సీత స్వభావం పసిగట్టాడు కాబోలుః

"ఈ తడా నువ్వే కొను మామయ్యా!" అని అంది సీత, చిరునవ్వు పెదవులమీద తొలకాడుతూ వుండగా.

నేను తెల్లబోయి, "అన్ని చాక్ లెట్లూ తినేశావా?" అని అడిగాను.

"ఊ" అన్నట్లు ఆమె తల వూపింది.

"ఇంక చాక్ లెట్లు వద్దు. జబ్బు చేస్తుంది."

"చాక్ లెట్లు జబ్బు చెయ్యవ్. బలమని చెప్పలేదూ, మన డాక్టరుగారు?"

"అయినా, వద్దు."

"ఇవ్వాళ నా పుట్టిన పండగ కాదూ, మామయ్యా?"

"అవుతే?"

"నేను తినగలిగినన్ని చాక్ లెట్లు నువ్వు కొనాలి."

కొననని నిష్కర్షగా చెప్పాను. రెండు నిముషాలు గడిచినై.

"మామయ్యా, నాకు ఒక పావలా బదులి

యిస్తావా? ఇంటికి వెళ్ళిన తర్వాత అమ్మని అడిగి యిచ్చేస్తాను."

"ఎందుకు?"

"కావాలి."

"ఎందుకో చెప్పు."

"ఇస్తానంటే చెప్తాను."

"ఇస్తాను, చెప్పు."

"చాక్‌లెట్లు కొనుక్కోవాలి."

నాకు నవ్వూ కోపమూ ఒక్కసారి వచ్చినై. ఇంకో పావలా తగలేసి చాక్‌లెట్లు కొని సీతకి యిచ్చాను.

మళ్ళీ సినీమా మొదలెట్టారు. ప్రకటనలు చూపిస్తున్నారు.

అమృతాంజనం ప్రకటన చూసి, సీత అడిగింద దేమిటని.

ఫలానా అన్నాను.

"ఈ సినీమా నేను చూడలేను. నాకు తల కాయ నొప్పి వస్తోంది, మావయ్యా."

"ఇలా పడుకో," అంటూ, తొడమీద తల పెట్టుకొని పడుకోమన్నాను.

"నేను అలా పడుకోను. ఇంటికి పోదాం."

"సినిమా అయిపోయిన తర్వాత పోదాం. అంత దాకా యిలా పడుకో."

"కాదు. ఇప్పుడే పోవాలి. నాకు తల భారంగా వుంది."

"నీ మొహం."

"నాకు తల పోటుగా వుంది."

"నీ తలకాయ."

"అవును, నాతలకాయే నొప్పిగావుంది. ఇంటికి పోయి, అమృతాంజనం రాసుకోవాలి."

సీత ఎంత చెప్పినా విన లేదు. ప్రకటనలు చూపించడంకాకపూర్వమే యింటికి ప్రయాణం కట్టింది.

"సినిమా పూర్తిగా చూడకుండా వెళ్ళడమేమిటి?" అని అన్నాను, నాకు బయలుదేరడం యిష్టం లేక.

"ఎందుకు పూర్తిగా చూడాలి?" ? ? ? ?

చెప్పండి బాబూ ఎందుకు చూడాలో !!!

* * *

ఇంటికి వస్తూ వస్తూ సీతని అడిగాను, 'సినిమా ఎలావుందని.'

సినిమాకంటె చాక్ లెట్లు బావున్నాయంది.

(జూలై 1987)